

## దీపావళి పర్వదిన శుభాకాంక్షలు

పాఠకులకు, ప్రకటన కర్తలకు, జర్నలిస్టు మిత్రులకు, వ్యాపారవాణిజ్యవేత్తలకు, అధికారులకు, నాయకులలకు, ప్రజాప్రతినిధులకు, విద్యావేత్తలకు, సాహితీవేత్తలకు, కవులు, కళాకారులకు, మహిళామణులకు ప్రతి ఒక్కరికీ
దీపావళి పర్వదిన శుభాకాంక్షలు..
పండుగ సందర్భంగా మంగళవారం కార్యాలయానికి సెలవు. పున: దర్శనం బుధవారం.

- వరంగల్ వాయిస్ యాజమాన్యం


# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 333
పేజీలు : 06 | వెల: రూ.5/-

సోమవారం
అక్టోబర్ 20, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


# తగ్గేదే లే..



దీపావళి పండుగ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బాణాసంచా దుకాణాలు రద్దీగా మారాయి. కొనుగోళ్లతో బిజీగా మారాయి. గ్రేటర్ వరంగల్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, కాజీపేట పట్టణాల్లో వందలాదిగా దుకాణాలు వెలిశాయి. ఇవే కాకుండా గల్లి..గల్లీలో కూరగాయలు అమ్మినట్లుగా టపాసుల అమ్మకాలు కొనసాగిస్తున్నారు. ఇందులో చాలా మంది దుకాణ దారులు ఎలాంటి అనుమతులు లేకుండానే టపాసుల విక్రయాలు జరుపుతున్నారు. అయితే గత ఏడాదితో పోలిస్తే టపాసుల ధరలు 30 శాతానికి పైగానే పెరిగినప్పటికీ 'తగ్గేదే లే' అన్నట్లుగా అమ్మకాలు మాత్రం జోరుగా సాగుతున్నాయి. దుకాణాలకు వెళ్లితే ధరలు చూసి చెమటలు పడుతున్నాయి. అగ్గిపెట్టె నుంచి థౌజండ్ వాలా వరకు అన్ని ధరలు పేలుతున్నాయి. ఏది కొందామన్న రూ.100పైనే ఉంది. వెయ్యి రూపాయలకు చిన్న క్యారీ బ్యాగ్ కూడా నిండడం లేదు. రకరకాల పేర్లు, రకరకాల రంగులతో ఆకట్టుకునేలా తయారు చేసిన క్రాకర్స్, బాణాసంచా కొనుగోలు చేసేందుకు జనం ఎగబడుతున్నారు. అయితే దీపావళి పర్వదినం సందర్భంగా టపాసుల వ్యాపారం కోట్లలో జరిగినప్పటికీ ఆదాయ పన్నులు మాత్రం అరకొరగానే చెల్లించడంలో ప్రభుత్వానికి పెద్దమొత్తంలోనే గండిపడుతోందన్న ప్రచారం సాగుతోంది.

– వరంగల్ వాయిస్ ప్రతినిధి

- పేలుతున్న టపాసుల ధరలు
- గత ఏడాదితో పోలిస్తే 30 శాతం పెరుగుదల
- తగ్గేదే లేదంటున్న జనం
- కొనుగోళ్లతో బిజీగా మారిన బాణాసంచా దుకాణాలు
- కోట్లలో వ్యాపారం.. వేలల్లో పన్నులు




WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

సోమవారం, అక్టోబర్ 20, 2025



# గాడిపెల్లి దేవకమ్మ దశదినకర్మ

## ప్రముఖుల నివాళులు

**వరంగల్ వాయిస్, చిన్నగూడూరు :** చిన్నగూడూరు మండల కేంద్రంలో దివంగత గాడిపెల్లి దేవకమ్మ దశదినకర్మ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గాడిపెల్లి కుటుంబం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాజకీయ, జర్నలిజం, సామాజిక రంగాల ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. దేవకమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన ప్రముఖులు, ఆమె కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ముఖ్యంగా జర్నలిజం రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న గాడిపెల్లి కుటుంబానికి చెందిన సీనియర్ జర్నలిస్టులు దివంగత గాడిపెల్లి చక్రయ్య, గాడిపెల్లి మధు, గాడిపెల్లి శ్రీహరి, గాడిపెల్లి యాదగిరిలకు వారు సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య, టీపీసీసీ మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి డీవై. గిరి, తట్టుపల్లి బీఆర్ఎస్ నాయకుడు మట్ట చిన్న సైదులు, తోకలి రామచంద్రులు పాల్గొన్నారు. వీరితో పాటు పలువురు జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు, బంధుమిత్రులు పాల్గొని గాడిపెల్లి దేవకమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

# కొండా మురళి జెండా పాట పోస్టర్ ఆవిష్కరణ

- **కొండా మురళి జన్మదినం సందర్భంగా రూపొందించిన అభిమాని**

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ భర్త మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు జన్మదినం సందర్భంగా వీరాభిమాని బి.రాజు ఆధ్వర్యంలో రూపొందించిన గుండె నిండా పొగరున్న జండా పాట పోస్టర్ ను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోపాల నవీన్ రాజ్, ఇతర ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ నెల 23న కొండా మురళి జన్మదినం. ఈ సందర్భంగా 23న పెద్ద ఎత్తున అన్నదాన, రక్తదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గోపాల నవీన్ రాజ్ ప్రకటించారు.

# దీపావళి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి సురేఖ, ఎంపీ కావ్య

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దీపావళి పర్వదినం సందర్భంగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. చీకటిపై వెలుగు సాధించిన దీపావళి పండుగ మనలో ఆశ, ఐకమత్యం, సానుకూలతను నింపుతుందన్నారు. ప్రతి ఇంటా వెలుగులు నిండాలని, ప్రతి హృదయం సంతోషంతో తళుకులాడాలని కోరుకుంటున్నట్లు మంత్రి సురేఖ, కడియం కావ్య అన్నారు. చిన్నారులు, యువకులు బాణాసంచా కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని, పెద్దల పర్యవేక్షణలో మాత్రమే పటాకులు కాల్చాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడుతూ, సురక్షితంగా, ఆనందంగా దీపావళిని జరుపుకోవాలన్నారు.












# శ్రీ కుంకుమేశ్వరాలయం అభివృద్ధిపై మాటల యుద్ధం

◆ రాజేశ్వరరావు గుడికి ఏం చేశారో చెప్పాలి
◆ ఏకు సుభాష్, బొచ్చు వాసు



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రమైన శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధిపై బీఆర్ఎస్ నాయకులు, మాజీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లుకు మద్దతుగా గళమెత్తారు. దేవస్థానం అభివృద్ధి బీఆర్ఎస్ పార్టీ హయాంలోనే జరిగిందని, ఈ వాస్తవాన్ని ఎవరూ కాదనలేరని బీఆర్ఎస్ నాయకులు ఏకు సుభాష్, బొచ్చు వాసు స్పష్టం చేశారు. వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత చైర్మన్ కొలుగూరి రాజేశ్వరరావు ఆలయ అభివృద్ధిలో తన పాత్రను వివరించకుండా, మాజీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని వారు పేర్కొన్నారు. “మీరు పదవుల కోసం పార్టీలు మారుతూ, ఆలయ అభివృద్ధికి ఏం చేశారో భక్తులకు, ప్రజలకు చెప్పాలి” అని వారు సూటిగా ప్రశ్నించారు. రాజేశ్వరరావు పత్రికా ప్రకటనల కోసం కాకుండా, ఆలయ రికార్డులను ఒకసారి పరిశీలించుకోవాలని, గుడికి ప్రస్తుత కమిటీ, అలాగే వెంకటేశ్వర్లు కుటుంబం ఎంత సహాయం, సేవ చేశారో రికార్డులే చెబుతాయని అన్నారు. గందె వెంకటేశ్వర్లు ఆలయ అభివృద్ధిలో నాలుగు పర్యాయాలు చైర్మన్‌గా పనిచేసి, భక్తుల మన్ననలు పొందారని బీఆర్ఎస్ నాయకులు గుర్తు చేశారు. ఆయన హయాంలోనే ఆలయ ఆదాయం గణనీయంగా పెరిగి, గుడి ఆర్థికంగా దృఢంగా నిలబడిందని దేవస్థానం రికార్డుల్లో స్పష్టంగా ఉందన్నారు. “ఆలయ అభివృద్ధి చూసి మీ నాయకులే ప్రశంసించారు. మీ సేవలు మాకు కావాలని మీ నాయకులు పార్టీలోకి ఆహ్వానించినా తిరస్కరించిన నిబద్ధత గల నాయకుడు వెంకటేశ్వర్లు. మీలాగా పదవుల కోసం పార్టీలు మారే వ్యక్తి కాదు” అని వారు బదులిచ్చారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశాల మేరకు, వెంకటేశ్వర్లు చేసిన సేవలు పరకాల ప్రజలందరికీ తెలుసని వారు ఉద్ఘాటించారు. ఆలయానికి సంబంధించిన భూమి వ్యవహారాన్ని కొందరు రాజకీయం చేస్తూ, వాస్తవాలు తెలియకపోయినా మాట్లాడడం సరికాదన్నారు. రాజకీయ లబ్ధి కోసం పార్టీలు మార్చే వ్యక్తి వెంకటేశ్వర్లు కాదని స్పష్టం చేశారు. “నోరు జాగ్రత్తగా ఉపయోగించాలి. దేవాలయ అభివృద్ధిలో భాగస్వాములపై తక్కువ మాట్లాడటం మీ విజ్ఞతకే వదిలేస్తున్నాం. చిల్లర వ్యాఖ్యల ద్వారా మీ గౌరవాన్ని కోల్పోకూడదు” అని ప్రస్తుత చైర్మన్‌ను, ఇతరులను వారు హెచ్చరించారు.

# దీపావళికి కూడా పస్తులేనా..?

◆ సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆవేదన



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా విద్యాశాఖలో సమగ్ర శిక్ష కింద పనిచేస్తున్న ఉద్యోగుల బతుకులు అగమ్యగోచరంగా మారాయని, సరైన సమయానికి వేతనాలు అందక పండుగల వేళ తీవ్ర ఆవేదన చెందుతున్నారని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గోవిందు నరేష్ ఆవేదన వ్యక్తం చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లపై గత సంవత్సరం 28 రోజులు సమ్మె చేసినప్పుడు, ప్రభుత్వం తరపున డిప్యూటీ సీఎం నెల రోజుల్లోనే సమస్యలను పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారని నరేష్ గుర్తుచేశారు. అయితే, హామీలు అమలు చేయకపోగా, కనీసం నెలవారీ జీతాలు కూడా సకాలంలో ఇవ్వకపోవడం దారుణమన్నారు. తెలంగాణలోనే అతిపెద్ద పండుగలైన బతుకమ్మ, దసరా పండుగలకు కూడా ఉద్యోగులకు వేతనాలు అందలేదన్నారు. ఇప్పటికే దసరా జీతం జమ కాలేదు. ఇప్పుడు దీపావళి కూడా జీతాలు రాకపోవడంతో, ఉద్యోగుల పరిస్థితి ‘మూలిగే నక్కపై తాటిపండు పడినట్లు’ తయారైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు అందకపోవడంతో కొంతమంది ఉద్యోగులు ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు కూడా ఉన్నాయని తెలిపారు. జీతాలు లేక దీపావళి పండుగను ఎలా చేసుకోవాలో తెలియక ప్రతీ ఉద్యోగి నిరాశానిస్పృహల్లో మునిగిపోయారని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం అని పిలవబడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి, సమగ్ర శిక్ష ఉద్యోగులకు గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అలాగే పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని గోవిందు నరేష్ డిమాండ్ చేశారు. సమ్మె కాలపు జీతం వెంటనే విడుదల చేయాలి, భద్రత కూడిన పే స్కేల్ అమలు చేయాలని, జీవిత బీమా కల్పించాలని, ఆరోగ్య బీమాను రూ. 10 లక్షలకు పెంచాలి, మృతి చెందిన సమగ్ర శిక్ష ఉద్యోగులకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి, సాధారణ ఉద్యోగుల మాదిరిగానే 22 సెలవులు మంజూరు చేయాలి, విద్యాశాఖ నిర్వహించే ఉద్యోగాలకు వెయిటేజ్ కల్పించాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.


# నవంబర్ 9న పద్మశాలి కార్తీక వనభోజనాలు

◆ పోస్టర్ విడుదల చేసిన జేఏసీ, సంఘం నాయకులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా పద్మశాలి కుల బాంధవుల కార్తీక మాస వనభోజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. పట్టణ పరపతి సంఘాల జేఏసీ కన్వీనర్/కో-కన్వీనర్ వైద్యం రాజగోపాల్, కార్తీక మాస వనభోజన కార్యక్రమం కన్వీనర్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కార్తీక వనభోజన కార్యక్రమం నవంబర్ 9, 2025 (ఆదివారం) ఉదయం 8:30 నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు జరుగుతుంది. భక్తి భావంతో కూడిన పూజా కార్యక్రమాలు ఉదయం 8:30 గంటలకు ప్రారంభమవుతాయి. ఇందులో భాగంగా గణపతి పూజ, పుణ్యవచనము, నవగ్రహ పూజ, మార్కండేయ పూజ, గాయత్రి పూజ హోమం, భద్రావతి బావనారుషి స్వామి పూజ, ధాత్రి నారాయణ పూజ, శివాభిషేకం (ప్రత్యేకంగా ఏర్పర్చిన శివలింగం వద్ద) ప్రాంగణంలోని వెంకటేశ్వర స్వామి, ఆంజనేయ స్వామి వారలను కూడా దర్శించుకోవచ్చు. పూజా కార్యక్రమాలకు సమాంతరంగా దేవస్థానం ఆవరణలోని కల్యాణ మండపంలో సమావేశం, సాంస్కృతిక కార్యక్రమాలు, సన్మాన కార్యక్రమాలు ఉంటాయి. మధ్యాహ్నం సాంస్కృతిక కార్యక్రమం కొనసాగుతుంది. సాయంత్రం ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్ ఉంటుంది. ఆశీర్వచనము, మహా మంగళహారతి, మండప ఉద్వాసన చేస్తారు. వనభోజనంలో పాల్గొనే పద్మశాలి కుల బాంధవులు అక్టోబర్ 20 వరకు తమ పరపతి సంఘాలు, సంక్షేమ సంఘాలు లేదా ఇతర సంఘాల ద్వారా కన్వీనర్ కు వివరాలు తెలియజేయాలి. ఈ విధంగా తెలియజేసిన వారికి భోజన కూపన్లు అందజేయబడతాయి. ముందుగా తెలియపరచకుండా వచ్చినవారు కూడా సమావేశ మందిరం గేటు వద్ద స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకోవడం తప్పనిసరి. పాల్గొనేవారు తమ పేర్లు నమోదు చేసుకొని, పద్మశాలి కండువా, స్టిక్కర్ ధరించి లోపలికి ప్రవేశించాలి. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి సంఘం నుంచి ముగ్గురికి, అలాగే అధిక సంఖ్యలో సభ్యులను పాల్గొనేలా చేసిన సంఘాలకు ఫస్ట్, సెకండ్, థర్డ్ ప్రైజ్‌లు ఇవ్వబడతాయి. సాంస్కృతిక ప్రదర్శనలలో పాల్గొనాలనుకునే పద్మశాలి కళాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి. స్వచ్ఛంద సేవా కార్యక్రమాలలో పాల్గొనేందుకు వాలంటీర్లుగా పేర్లు నమోదు చేసుకున్న వారికి సన్మాన కార్యక్రమం ఉంటుంది. ఇది పద్మశాలి కుల బాంధవులకు సంబంధించిన కార్యక్రమం కాబట్టి, ఇతరులను వెంట తీసుకురాకూడదు. బిజినెస్ అడ్వర్టైజ్‌మెంట్ స్టాల్స్ ఏర్పాటు చేయదలిచిన వారు, వివిధ విభాగాలకు (శివాభిషేక మండపం, భోజన కార్యక్రమం టెంట్, ఆర్చ్ గేట్ అలంకరణ మొ.) స్పాన్సర్‌షిప్ చేయదలిచిన వారు కన్వీనర్ ని సంప్రదించవచ్చు. ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటుకు అనుమతి తీసుకొని నిర్ణీత రుసుము చెల్లించవలెను. భక్తి భావంతో వచ్చి, పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని, స్నేహభావంతో భోజనం స్వీకరించాలని నిర్వాహకులు కోరారు. ఈ పోస్టర్ విడుదల సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి తౌటం రవీందర్, ఉపాధ్యక్షుడు నల్ల సత్యం, కమలాపూర్ మండల అధ్యక్షుడు బొప్పా శివ శంకర్, కార్యదర్శి కేదాసి వెంకన్న, పరపతి సంఘాల అధ్యక్షులు కామిని మల్లేశం, సోమిడి అధ్యక్షులు కోటేశ్వర్, కార్యదర్శి దేవులపల్లి సదానందం, రెడ్డి కాలనీ నుంచి నరేందర్, కాజీపేట సంఘం నుంచి తుమ్మ శ్రీనివాస్, సుబేదారి సంఘం నుంచి భావన ఋషి గుండేటి చక్రపాణి, గైని సత్యనారాయణ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విగ్రహాల ప్రతిష్టాపన మహోత్సవానికి విరాళం



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలోని ప్రఖ్యాతిగాంచిన కాకతీయుల కాలం నాటి శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి దేవాలయంలో వచ్చే నెల కార్తీక మాసంలో ప్రతిష్టాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. నవంబర్ 14, 15, 16 తేదీల్లో జరగనున్న ఈ మహోత్సవంలో భాగంగా గణపతి, శివలింగం, నవగ్రహాలు, అష్ట బలిపీఠ ప్రతిష్టాపన చేయనున్నారు. ఈ పవిత్ర కార్యక్రమం కోసం స్థానిక మార్క సుమలత, శ్రీనివాస్ గౌడ్ (హోటల్) దంపతులు తమ వంతుగా రూ.15,016/- నగదు విరాళాన్ని ఆలయ కమిటీకి అందించారు. ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్ కు వారు ఈ మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ముసునూరి నరేష్ దాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీర్వచనాలు అందించారు. ఆలయ కమిటీ సభ్యులు బండారు శంకర్, మూలా శ్రీనివాస్ గౌడ్, భటిక స్వామి, బూర రాజగోపాల్ గౌడ్, మాదాసు మొగిలి గౌడ్, మాదాసు అర్జున గౌడు, ఉయ్యాల భిక్షపతి గౌడ్, దయ్యాల భద్రయ్య, పాండవుల భద్రయ్య, మోటపోతుల రాజన్న గౌడ్, గోరంటల రాజన్న గుప్త తదితరులు పాల్గొన్నారు. భక్తుల సహకారంతో ఈ ప్రతిష్టాపన మహోత్సవాన్ని దిగ్విజయంగా పూర్తి చేస్తామని ఆలయ కమిటీ పేర్కొంది.

# కార్తీక మాస ఉత్సవాలకు ముస్తాబైన కోట గుళ్లు



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలో వెలసిన కాకతీయుల కళాక్షేత్రం, శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం (కోటగుళ్లు), పవిత్రమైన కార్తీక మాస ఉత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల అక్టోబర్ 22 మంగళవారం నుంచి నవంబర్ 20 వరకు ఆలయంలో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. నెల రోజుల పాటు ప్రతి సాయంత్రం కార్తీక పురాణం పఠనం, హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుంది. కోటగుళ్ళు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఈ సంవత్సరం కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని, నవంబర్ 5వ తేదీన ఆలయ ప్రాంగణంలో కనువిందు చేసే విధంగా దీపోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ దీపోత్సవంలో భాగంగా మట్టి ప్రమిదలతో ఏకంగా 21 వేల దీపాలను ఏర్పాటు చేయాలని కమిటీ లక్ష్యంగా పెట్టుకుంది. దీపోత్సవానికి నూనెను అందజేయాలనుకునే భక్తులు ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజుని సంప్రదించాలని కోటగుళ్ల పరిరక్షణ కమిటీ విజ్ఞప్తి చేసింది. నెల రోజులపాటు జరిగే ఈ పవిత్ర పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కమిటీ కోరింది.

# రేగూరి రంగమ్మ దశదినకర్మ

పాల్గొన్న బీజేపీ నేత సిరంగి సంతోష్ కుమార్



**వరంగల్ వాయిస్, పరకాల :** స్థానిక మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ రేగూరి జైపాల్ రెడ్డి తల్లి రేగూరి రంగమ్మ దశదినకర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ హాజరయ్యారు. డాక్టర్ సంతోష్ కుమార్ రంగమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు పరకాల పట్టణ ప్రధాన కార్యదర్శి సంఘ పురుషోత్తం, బొజ్జం చొక్కా రావు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లలో రాష్ట్రాల వారీగా వైవిధ్యం?




### (విశ్లేషణాత్మక వ్యాసం)

భారతదేశంలో రిజర్వేషన్ల వ్యవస్థ సామాజిక న్యాయాన్ని, సమానత్వాన్ని సాధించేందుకు ఉద్దేశించిన ఒక కీలక సాధనం. అయితే, షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) విషయంలో దేశవ్యాప్తంగా ఒకే విధమైన చట్టబద్ధత, నిష్పత్తి అమలు అవుతున్నప్పటికీ, వెనుకబడిన తరగతుల (బీసీ) రిజర్వేషన్ల విషయంలో ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధానం అమలు కావడం అనేక ప్రశ్నలకు, చర్చలకు తావిస్తోంది. తమిళనాడు వంటి రాష్ట్రాల్లో 'మేమెంత, మాకంత' అనే నినాదంతో బీసీ రిజర్వేషన్లు అమలవుతుంటే, ఇతర రాష్ట్రాల్లో ఆ పరిస్థితి లేకపోవడం వెనుక ఉన్న కారణాలు ఏంటి? రాజ్యాంగం బీసీల విషయంలో వివక్ష చూపుతుందా?

#### రాష్ట్రాల వారీగా వైవిధ్యానికి కారణాలు

బీసీ రిజర్వేషన్లలో రాష్ట్రాల మధ్య తేడాలు ఉండటానికి ప్రధాన కారణాలు రాజ్యాంగపరమైన, సామాజిక–రాజకీయ అంశాలలో ఉన్నాయి. రాజ్యాంగ వెసులుబాటు (ఆర్టికల్స్ 15(4), 16(4)): ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన జాబితాలు కేంద్ర ప్రభుత్వం ద్వారా దేశవ్యాప్తంగా స్థిరంగా ఉన్నప్పటికీ, ఓబీసీ (OBC)లకు సంబంధించి రిజర్వేషన్లను అమలు చేయడంలో, జాబితాలను రూపొందించడంలో రాష్ట్రాలకు స్వయంప్రతిపత్తి లభించింది. రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాష్ట్రంలోని సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులను గుర్తించడానికి ప్రత్యేక బీసీ కమిషన్లను ఏర్పాటు చేసుకునే అధికారం ఉంది. దేశంలోని ప్రతి రాష్ట్రంలో కులాల కూర్పు, వాటి జనాభా, వాటి సామాజిక–ఆర్థిక వెనుకబాటుతనం వేరుగా ఉంటుంది. ఉదాహరణకు, ఒక రాష్ట్రంలో బీసీ వర్గంగా ఉన్న కులం, మరో రాష్ట్రంలో వేరే స్థితిలో ఉండవచ్చు. ఈ ప్రాంతీయ వైవిధ్యం కారణంగానే రిజర్వేషన్ల శాతం మారుతుంది. సుప్రీంకోర్టు విధించిన 50% రిజర్వేషన్ల పరిమితి దేశవ్యాప్తంగా వర్తిస్తుంది. అయితే, తమిళనాడు (69%) వంటి కొన్ని రాష్ట్రాలు స్థానిక సామాజిక పరిస్థితుల ఆధారంగా చట్టాలు చేసి, వాటిని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా 50% పరిమితి నుంచి తాత్కాలిక మినహాయింపు పొందాయి.

#### తమిళనాడు విధానం - 'మేమెంత, మాకంత'

తమిళనాడులో బీసీ రిజర్వేషన్లు ఏకంగా 50% (ఓబీసీ, ఎంబీసీ కలిపి 69% మొత్తం రిజర్వేషన్) వరకు అమలు అవుతున్నాయి. దీని వెనుక బలమైన సామాజిక ఉద్యమాలు, రాజకీయ సంకల్పం ఉన్నాయి. తమ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు ఉండాలనే ఆకాంక్షతో అక్కడి ప్రభుత్వాలు చట్టాలను చేశాయి. ఇతర రాష్ట్రాలు ఈ విధానాన్ని అమలు చేయాలంటే, వారికి కూడా ప్రత్యేక సామాజిక–ఆర్థిక సర్వేలు, బలమైన రాజకీయ మద్దతు, రాజ్యాంగ సవరణల ద్వారా 9వ షెడ్యూల్ రక్షణ అవసరం అవుతుంది.

బీసీ కుల గణనను నిర్వహించడం అనేది రాష్ట్రాల పరిధిలో ఉన్న కీలకమైన అంశం. రాష్ట్రాలు తమ సామాజిక పరిస్థితులు, ఆర్థిక స్థితిగతులను పరిగణనలోకి తీసుకుని నిర్వహించే కులగణన సర్వేల ఆధారంగానే, బీసీలకు కేటాయించాల్సిన 'రిజర్వేషన్ల వాటా '(పర్సంటేజ్)ను నిర్ణయించాల్సి ఉంటుంది. ఈ మేరకు రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి, ఆ ప్రతిపాదిత నిష్పత్తిని తొమ్మిదవ షెడ్యూల్ లో చేర్చడానికి పార్లమెంటు తక్షణమే అనుమతించాలని దేశవ్యాప్తంగా డిమాండ్లు పెరుగుతున్నాయి. తెలంగాణతో సహా అనేక రాష్ట్రాలలో బీసీల జనాభా గణనీయంగా ఉంది. రాష్ట్రాలు తమ శాసనసభల ద్వారా తీర్మానాలు చేసి పంపే కుల గణన నిష్పత్తిని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా, ఆ రిజర్వేషన్లకు న్యాయ సమీక్ష నుంచి రక్షణ కల్పించినట్టు అవుతుంది. సుప్రీంకోర్టు నిర్ణయించిన 50శాతం రిజర్వేషన్ల పరిమితిని మించినప్పటికీ, సామాజిక న్యాయ లక్ష్యం నెరవేరేందుకు ఈ చర్య కీలకం. రాష్ట్రాల డిమాండ్‌లు, ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే దీనికి మించిన మార్గం లేదు. కుల గణన అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య జరుగుతున్న కీచులాటల కారణంగా బీసీ ప్రజల సామాజిక న్యాయ ఆకాంక్షలు నెరవేరడం లేదు. రాష్ట్రాలు తమ మెజారిటీ ప్రజల కోసం చేసిన తీర్మానాలు, ప్రజల ఆకాంక్షలు ఈ రాజకీయ ఘర్షణల మధ్య ఊగిసలాడుతున్నాయి. ఉదాహరణకు, తెలంగాణ రాష్ట్రంలో కులగణన నిష్పత్తి ప్రకారం 'మనమెంత, మనకంత' అనే సూత్రాన్ని అమలు చేయడానికి తొమ్మిదవ షెడ్యూల్ వెసులుబాటు కల్పిస్తుంది. దీనివల్ల లోకల్ బాడీస్, చట్టసభలు, ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాలయాలు, నామినేటెడ్ పోస్టులలో బీసీలకు తగిన ప్రాతినిధ్యం దక్కుతుంది.

#### బీసీల విషయంలో రాజ్యాంగ వివక్ష ఉందా?

ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక రక్షణలు, ఏకరూపత బీసీలకు లేదన్నది వాస్తవం. ఎస్సీ/ఎస్టీలకు ప్రత్యేకంగా రాజ్యాంగబద్ధమైన అధికారాలు, రక్షణలతో జాతీయ కమిషన్లు ఉన్నాయి. ఓబీసీలకు కూడా జాతీయ కమిషన్ ఉన్నప్పటికీ, దాని అధికారాలు, ప్రభావం కొంత పరిమితంగా ఉండేది. అయితే, 2018లో 102వ రాజ్యాంగ సవరణ ద్వారా జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా (ఆర్టికల్ 338B) లభించింది. అయినప్పటికీ, ఎస్సీ, ఎస్టీలకు ఉన్నంతటి చట్టబద్ధమైన ఏకరూపత (Uniformity) బీసీ రిజర్వేషన్లలో ఇంకా రాలేదు. బీసీల గుర్తింపు అనేది రాష్ట్రాల పరిధిలో ఉంచడం, జాతీయ స్థాయిలో బీసీ జనాభా లెక్కలు (కులం ఆధారంగా) లేకపోవడం వంటి కారణాల వల్ల దేశవ్యాప్తంగా బీసీ రిజర్వేషన్లలో ఒకే విధమైన విధానం అమలు కావడం సవాలుగా మారింది. ప్రజాస్వామ్య దేశంలో మెజారిటీ ప్రజల ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకోవాలి. దేశ జనాభాలో బీసీలు మెజారిటీగా ఉన్నారనేది పలు అంచనాలు చెబుతున్నాయి. బీసీల అసలు జనాభా ఎంత అనేది తెలుసుకోవడానికి కులం ఆధారిత జనాభా లెక్కలు (Caste Census) అవసరం. దీనిపై దేశవ్యాప్తంగా చాలా కాలంగా డిమాండ్ ఉంది. ఖచ్చితమైన జనాభా లెక్కలు తెలిస్తేనే, 'మేమెంత, మాకంత' అనే న్యాయ సూత్రాన్ని అమలు చేయడానికి అవకాశం లభిస్తుంది. మెజారిటీ బీసీ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలంటే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బలమైన రాజకీయ సంకల్పం అవసరం. 50% పరిమితిని సవరించడం లేదా, 9వ షెడ్యూల్ రక్షణ కల్పించడం వంటి కఠిన నిర్ణయాలు తీసుకోవాలి. "ఈనెల 18న బంద్ ఆరంభమే" అన్న మీ పిలుపునకు అనుగుణంగా, బీసీ హక్కుల సాధనకు ఒక స్పష్టమైన కార్యాచరణ అవసరం. కేవలం రాష్ట్రాల వారీగా కాకుండా, జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాల బీసీ సంఘాలు ఏకమై ఉద్యమించడం ద్వారానే దేశవ్యాప్తంగా ఒకే విధమైన రిజర్వేషన్ విధానాన్ని సాధించగలరు. ఈ దిశగా మేధావులు, బీసీ నాయకులు ఆలోచించి, దశలవారీగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ అంశంపై దేశవ్యాప్త చర్చ జరగాలి, అప్పుడే బీసీలకు రాజ్యాంగం కల్పించిన ఫలాలన్నీ సంపూర్ణంగా అందుతాయి.

**వైద్యం రాజ గోపాల్**




బీసీ జేఏసీ వరంగల్ జిల్లా వైస్ చైర్మన్,
పద్మశాలి పరపతి సంఘాల
జేఏసీ హనుమకొండ జిల్లా కన్వీనర్

# డిప్యూటీ కలెక్టర్‌గా విలాయత్ అలీ

## ఎమ్మెల్యే నాగరాజు అభినందనలు



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పున్నేలు గ్రామానికి చెందిన మహమ్మద్ విలాయత్ అలీ గ్రూప్–1 ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి, తాజాగా డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఆయన రాష్ట్ర స్థాయిలో 489.5 మార్కులతో 86వ ర్యాంకు సాధించగా, ముఖ్యంగా బీసీ–ఈ (బీసీ–ఈ) కేటగిరీలో మొదటి ర్యాంకు కైవసం చేసుకున్నారు. విలాయత్ అలీ సాధించిన ఈ ఘన విజయం పట్ల వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ "మన వర్ధన్నపేట నియోజకవర్గానికి చెందిన పున్నేలు గ్రామ యువకుడు మహమ్మద్ విలాయత్ అలీ రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాంకు సాధించి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపిక కావడం మనందరికీ ఎంతో గర్వకారణం." అని అన్నారు. "కృషి, పట్టుదల, క్రమశిక్షణతో సాధించలేనిది ఏదీ లేదని ఆయన నిరూపించారు. యువత అంతా విలాయత్ అలీని ఆదర్శంగా తీసుకుని ఉన్నత లక్ష్యాలు సాధించేందుకు కృషి చేయాలి," అని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విలాయత్ అలీ కుటుంబ సభ్యులకు, గురువులకు, గ్రామ ప్రజలకు కూడా ఆయన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

# ఘనంగా ధన్వంతరి జయంతి

## నివాళులర్పించిన డా. ఏ. రాజేంద్ర ప్రసాద్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వైద్యానికి మూలపురుషుడిగా, ఆయుర్వేద పితామహుడిగా పూజలందుకునే ధన్వంతరి మహనీయుని జయంతిని పురస్కరించుకుని ఘనంగా వేడుకలు నిర్వహించారు.
ఈ సందర్భంగా డాక్టర్ ఏ. రాజేంద్ర ప్రసాద్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో కొలువై ఉన్న ధన్వంతరి దేవుని విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "వైద్య వృత్తిలో ఉన్న మనమందరం నిత్యం ధన్వంతరి పితామహుడిని స్మరించుకోవడం, ఆయన చూపిన మార్గాన్ని అనుసరించడం మన విద్యుక్త ధర్మంగా భావించాలి. ఆయుర్వేదం అందించిన గొప్ప వారసత్వాన్ని కాపాడుకోవాలి," అని పేర్కొన్నారు.

# కాలుష్య రహిత దీపావళి జరుపుకోవాలి

## ఏకశిలా ప్రైమ్ పాఠశాల డైరెక్టర్ బేతి కొండల్ రెడ్డి



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని ఏకశిలా ప్రైమ్ పాఠశాలలో దీపావళి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బేతి కొండల్ రెడ్డి, ప్రిన్సిపాల్ గోకుల్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ దీపా, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి డైరెక్టర్ బేతి కొండల్ రెడ్డి గారు మాట్లాడుతూ... దీపావళి పండుగను ఎందుకు జరుపుకుంటారు, దాని విశిష్టత ఏంటి అనేది విద్యార్థులకు వివరించారు. ముఖ్యంగా, ప్రతి ఒక్కరూ కాలుష్య రహిత దీపావళిని జరుపుకోవాలని పిలుపునిచ్చారు. దీనిని ఆచరణలో చూపిస్తూ, ముందుగా ఆయన స్వయంగా ఒక దీపాన్ని వెలిగించి, పండుగ స్ఫూర్తిని అందరికీ తెలియజేశారు.

# తగ్గేదే లే..

- పేలుతున్న టపాసుల ధరలు
- గత ఏడాదితో పోలిస్తే 30 శాతం పెరుగుదల
- తగ్గేదే లేదంటున్న జనం
- కొనుగోళ్లతో బిజీగా మారిన బాణాసంచా దుకాణాలు
- కోట్లలో వ్యాపారం..వేలల్లో పన్నులు



**వరంగల్ వాయిస్ ప్రతినిధి** : టపాసుల ధరలు పేలిపోతున్నాయి. గతేడాదితో పోలిస్తే అన్నింటి ధరలను 20 నుంచి 30 శాతం వరకు పెంచేశారు. దీంతో కొనుగోలు దారుడి జేబు గుల్ల కావడం ఖాయంగా మారింది. ఏది కొందామన్న రూ.100పైనే ఉంది. చిన్న, మధ్య తరగతి కొనుగోలుదారులు వెయ్యి రూపాయలు తీసుకెళ్లితే చిన్న క్యారీ బ్యాగ్ కూడా నిండడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దుకాణాలకు వెళ్లితే ధరలు చూసి చెమటలు పట్టే పరిస్థితి నెలకొంది. అగ్గిపెట్టె నుంచి థౌజండ్ వాలా వరకు అన్ని ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి.

### విచ్చల విడిగా విక్రయాలు..

వరంగల్ త్రినగరిలో విచ్చల విడిగా వక్రయాలు కొనసాగుతున్నాయి. గల్లీలో ఉండే దుకాణాదారులు సైతం పెద్ద మొత్తంలో బాణాసంచా కొనుగోలు చేసి రిటైల్ గా అమ్మకాలు సాగిస్తున్నారు. వారికి ఎలాంటి అనుమతులు లేనప్పటికీ విక్రయాలు చేయడంపట్ల చుట్టుపక్కల గృహ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకుండానే విక్రయాలు చేస్తున్నట్లు వారు ఆరోపిస్తున్నారు. ఏదైనా జరుగరానిది జరిగితే మాత్రం స్థానికంగా పెద్ద నష్టమే జరుగుతుందంటున్నారు. విచ్చల విడిగా విక్రయాలు జరుగుతున్నా నగరపాలక సంస్థ అధికారులు కాని, అగ్నిమాపక సంస్థ అధికారులు కాని ఏమాత్రం పట్టించుకోకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### తగ్గేదే లేదు..

రంగు రంగుల క్రాకర్స్, బాణాసంచా కొనుగోలు దారులను అమితంగా ఆకర్షిస్తున్నాయి. వాటిని పెద్ద మొత్తంలో కొనుగోలు చేసేందుకు జనం ఉత్సాహం చూపుతున్నారు. ధరలను ఏమాత్రం లెక్క చేయకుండా కొనుగోళ్లకు ఎగబడుతున్నారు. ఏ దుకాణం చూసినా తగ్గేదే లే.. అన్నట్లుగా విక్రయాలు సాగుతున్నాయి. ప్రతి ఇంట్లో బాణసంచా మోత వినిపిస్తుంది. డబ్బులు లేకపోయినా అప్పు చేసి పండుగ జరుపుకుంటారు. దీంతో బాణాసంచా వ్యాపారం ప్రతి ఏడు కోట్లలో జరుగుతోంది. అయినప్పటికీ అంతా జీరో అన్నట్లుగా ఈ వ్యాపారం సాగడం గమనార్హం. బాణాసంచా దుకాణాల విక్రయాల ద్వారా ప్రభుత్వానికి పెద్దమొత్తంలో ఆదాయానికి గండిపడుతోంది. ప్రతి ఏడు ఇది మామూలే అన్నట్లుగా సాగడంపట్ల పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ కొందరు అధికారులే జేబులు నింపుకోవడంపై మండి పడుతున్నారు. ఈ విషయంలో ఆదాయ పన్ను శాఖ, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదే విధంగా విచ్చల విడిగా జరుగుతున్న విక్రయాలను అరికట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందంటున్నారు.





# లలిత ఆర్థో ఆసుపత్రి చైర్మన్‌కు అరుదైన గౌరవం



- **వరంగల్ ఆర్థోపెడిక్ సర్జన్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా డాక్టర్ మహేశ్వర్**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ ఆర్థోపెడిక్ సర్జన్ల అసోసియేషన్ (WOSA)నూతన అధ్యక్షుడిగా ప్రముఖ వైద్యులు, లలిత ఆర్థో ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ దోమల మహేశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆయనకు ఈ అరుదైన గౌరవం లభించడం పట్ల వరంగల్ నగరంలోని ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్ మహేశ్వర్‌కు నగరంలోని ప్రముఖులు, రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, సహచర వైద్యులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలిపారు.

డాక్టర్ మహేశ్వర్ ఎన్నికపై వరంగల్ వాయిస్ దినపత్రిక ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, నెట్వర్క్ ఇంచార్జి సామల సూర్య ప్రకాశ్, డెస్క్ ఇంచార్జి గోలి రవి, టెక్నికల్ ఇంచార్జి వెన్న రాములతో పాటు హనుమకొండ, దామెర, వరంగల్ రిపోర్టర్లు సిద్దోజు రాకేష్, ఉస్నగిరి శ్రీకాంత్, పూజారి విజయ్ తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.






వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
సోమవారం, అక్టోబర్ 20, 2025



# చెడుపై విజయం

- అదే నరకాసుర వధ ముఖ్య ఉద్దేశ్యం
- భద్రకాళి గుడి అయ్యగారు భద్రకాళి శేషు
- నరకాసుర వధ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ సుధారాణి



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** చెడుపై మంచి సాధించడమే నరకాసుర వధ ముఖ్య ఉద్దేశ్యం అని భద్రకాళి గుడి ప్రధానార్చకులు భద్రకాళి శేషు అన్నారు. ఉర్సుగుట్ట ప్రాంతంలోని కుడా మైదానంలో ఆదివారం రాత్రి నరకాసుర వధ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. నరకాసురవధ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మరుపల్ల రవి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో భద్రకాళి శేషుతోపాటు గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సభా వేదికపై ఏర్పాటు చేసిన శ్రీ కృష్ణ-సత్యభామ ప్రతిమలకు మేయర్ గుండు సుధారాణి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భద్రకాళి శేషు దీపావళి పర్వదినం ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఏడు నరకాసుర వధ ఎందుకు నిర్వహించాలో వెల్లడించారు. అసుర శక్తులు మానవ ప్రయత్నాలను విఫలం చేస్తారన్నారు. సాధన చేయడం ద్వారా వాటిని జయించ వచ్చన్నారు. పాపాన్ని నాశనం చేసుకొని పుణ్యాన్ని సంపాదించుకోవాలని సూచించారు. మనుషుల్లో ఉన్న ఈర్ష్య, అసుర నశించిపోవడమే నరకాసుర వధ ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ప్రపంచమంతా మన సనాతన ధర్మాన్ని ఆచరించేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. ప్రతి మాతృమూర్తిలో అమ్మను దర్శించాలని శాస్త్రాలు చెబుతున్నాయన్నారు. సాంప్రదాయాల పట్ల గౌరవం కలిగి ఉండాలని ఈ సందర్భంగా భద్రకాళి శేషు ఉద్ఘాటించారు. సభాధ్యక్షుడు మరుపల్ల రవి మాట్లాడుతూ నరకాసుర వధ అనంతరమే నోములు, వ్రతాలు నిర్వహించుకోవాలని పండితులు చెబుతున్నారన్నారు. అలా చేస్తేనే మనకు అంతా మంచి జరుగుతుందన్నారు. అనంతరం మేయర్ నరకాసుర ప్రతిమకు అమర్చిన టపాసుల స్విచ్ ను మీట నొక్కి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మరుపల్ల రవి, పల్లం పద్మ, భోగి సువర్ణ సురేష్, పోశాల పద్మ, నరకాసుర వధ ఉత్సవ కమిటీ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆద్యంతం అలరించాయి. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు నగరం నలుమూలలనుంచి పెద్దఎత్తున తరలివచ్చారు. మిల్స్ కాలనీ పోలీసులు భారీ బందోబస్త్ ఏర్పాటు చేశారు.
















EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com